# పూర్‌ఫెలో భద్రం !

సైకిలు మీద వస్తున్న నాయుడు రోడ్డు మీద నడిచి వెడుతున్న భద్రాన్ని వెనుక నుంచి చూచి సడన్ బ్రేకేసి సైకిలు దిగాడు.

'ఏరా హౌ ఆర్‌యూ?-భుజం తట్టి అడిగాడు నాయుడు.

'ఇదిగో యిలా వున్నాను!...' లేని నవ్వు ముఖాన పులుముకుని బదులిచ్చాడు భద్రం.

'చాలా రోజులైంది నిన్ను చూసి... ఏమిట్రోయ్ మనిషివి తగ్గినట్టు కన్పిస్తున్నావ్... వెంట నడుస్తూ అన్నాడు నాయుడు.

'శరీరం మాత్రం ఎట్లావున్నా... మనసులోని బరువు తగ్గేమార్గం కన్పించటం లేదు...'

భద్రం మాటలకి విస్మయం చెంది 'ఏమిట్రా డల్‌గా వున్నావ్?...' పరామర్శగ అన్నాడు.

'డల్‌కాదురా దిగులు...'

'ఏం? ఏమైంది? మేరేజై ఆర్నెల్లయినా కాని కొత్త పెళ్లి కొడుకువి... నీకు దిగులేంట్రా?..'

'మన డిస్కషన్ రోడ్ మీదెందుకు కానీ... అలా బార్లో కూర్చుని మాట్లాడుకుందాం! నీతో చాలా విషయాలు చెప్పాలి..'

నాయుడు భద్రం బాల్య స్నేహితులు! కలిసి చదువుకున్నారు. ఇద్దరి అభిప్రాయాలు అభిరుచులు ఒకటే!

ఇద్దరూ ఎదురుగా వున్న హైక్లాస్ బార్లోకి నడిచారు.

భద్రం ప్రభుత్వోద్యోగి! నెలకి నాలుగు అంకెల సాలరీకళ్ల చూస్తాడు. జీతం అసలు లెక్కలోనిది కాదు. మనిషి మతిలేని సన్నాసిలా కన్పిస్తాడు గాని బుర్రనిండా తెలివితేటలే?

జీతానికి పదిరెట్లు నెలతిరిగే సరికి మామూళ్ల రూపంలో జేబులోకొచ్చి పడతాయ్! దేహీ అంటూ చేయి చాచాల్సిన పన్లేదు. పని చేయించుకోవటానికి ఆఫీసుకి వచ్చే పార్టీలే దోసిట్లో పోసి మరీ వెడుతుంటారు. అది వాడి లక్!

ఎన్ని జన్మల పుణ్యాల ఫలమోగాని... తంతే గారెల బుట్టలో పడినట్టు అతగాడికి వుద్యోగం ఆడిపార్ట్‌మెంట్లో రావటం భద్రం చేసుకున్న పూర్వజన్మ సుకృతం!

జేబునిండా అరడజను క్రెడిట్ కార్డ్స్...ఏ బేంక్‌లో ఎంత బేలన్సుందో తెల్సుకోవాలంటే ఇంట్లో కంప్యూటర్ ఆన్ చేస్తేగానీ తెలీదు.

వాళ్ల పేరంట్స్‌కి ఏకైక పుత్రుడు భద్రం కావటం మరో లక్!

భద్రంఫాదర్ ఆర్టీఓ ఆఫీసులో జవాను ఉద్యోగం చేసి రిటైరైన ఏడాదిలోపే టపా కట్టాడు.

అయితేనేం నలభైయేళ్ల సర్వీసులో లెక్కలేనంత సంపాదించాడు.

రెండు మేడలు... ఇద్దరు భార్యలు... టాక్సీలుగాసిటీలో తిరిగే నాలుగు కార్లు... కట్టుకున్న పెళ్లాం మెడలో ఆమె మోయలేనన్ని బంగారు నగలు... బాంకులో డిపాజిట్లు... పదెకరాల మాగాణి... సిటీలో నాలుగు వేపులా వెయ్యేసి చ.గ. ప్లాట్లు.... ఓ చిన్న సైజు కోటీశ్వరుడుగా బతికాడు భద్రం ఫాదర్.

సెకండ్ సెటప్‌కి సంతానం లేదు. ఆఫీషియల్‌గా పెళ్లాడిన భార్యకి భద్రం ఒక్కడే! గారాబు పట్టి!

డిగ్రీ పూర్తి కాగానే ఆడుతూ పాడుతూ... అక్కర్లేదనుకుంటూనే సర్వీసు కమీషన్ టెస్ట్ వ్రాసాడు. సెలక్షనొచ్చి మహత్తరమైన గోల్డుమైన్ లాంటి డిపార్ట్‌మెంట్‌లో పడ్డాడు.

అది సుతా... భద్రం పట్టిందల్లా బంగారమే! పచ్చనోటుమారిస్తే చిల్లరపుచ్చుకోడు.

మహారాజుగారి చేతికి వున్నట్టు భద్రం చేతి అన్ని వేళ్లకి గోల్డ్ రింగ్స్! మెళ్లో పలుపుతాడు లాంటి గోల్డ్‌చైను-కుడి చేతి ముంజేతికి బంగారు బ్రాస్‌లెట్!

ఓహ్ భద్రం స్టైలే వేరు.. వేరొకరికి తెచ్చి పెట్టుకుందామనుకున్నారాదు.. కాదు చేతకాదు!

'అవునూ ... నువ్ నడిచిరావటమే మిత్రా?' కళ్లు పెద్దవి చేస్తూ అడిగాడు నాయుడు.

'నిన్న కారుకి చిన్న ఏక్సిడెంటైంది. రిపేర్‌కి ఇచ్చాను...'

'మరి ... స్కూటర్ మీద రావచ్చుగా...'

"అదీ ముసలి డొక్కైంది. పాత ఇనుప సామాను కింద అమ్మేసింది మా మమ్మీ..."

'బొత్తిగా నడక లేకుండా పోయిందిరా... బాడీలో 'కొలెస్ట్రాల్'శాతం పెరుగుతోంది. వాకింగ్ జాగింగ్ చాలా అవసర మన్పిస్తోంది...' జేబులోంచి ట్రిబుల్ ఫైవ్‌పాకెట్ తీసి నాయుడికి ఆఫర్ చేసి తనూ వెలిగించాడు భద్రం.

'కొత్త పెళ్లి కొడుకువి... అప్పుడే ఆరోగ్యసూత్రాలు పాటిస్తున్నావన్నమాట...' తెలివిగా నవ్వేడు నాయుడు.

'పెళ్లిమాటెత్తకురా... వళ్లంతా కంపరంగా వుంటుంది...'

"మేరీడ్ వైఫ్ అప్పుడే అంతబోర్ కొట్టిందా చిట్టితండ్రి...?'

బార్లో చీకటిగా వున్న ఒక మూల కూర్చుని కబుర్లు చెప్పుకుంటూండగా 'స్టీవర్ట్' వచ్చి ఏం కావాలో ఆర్డర్ తీసుకువెళ్లాడు.

'నాది అరేంజ్‌డ్ మేరేజ్ అయినా ఫెయిలైందిరా...' బాధతో తల చేత్తోపట్టుకున్నాడు భద్రం.

"అదేమిట్రా అట్లా అంటున్నావ్"- నివ్వెర పోయాడు నాయుడు

"అదంతేరా? - నా బేడ్‌లక్! ఒక్క పెళ్లి విషయంలోనే నేను ఘోరంగా ఓడిపోయా(నా నాయుడూ.. ఓడిపోయాను!-"భద్రం కంఠం రుద్రమైంది.

"నువ్వొట్టి ఫూల్‌వి! పెళ్లాం మనసు తెలుసుకోలేక పోయావంటే... నొవ్వట్టి సన్నాసివి! చివరి దాకా కాలిన సిగరెట్‌ను యాష్‌ట్రేలోకి నెట్టాడు నాయుడు.

"అవును నేను ఫూల్‌నే..."

"అది కాదురా... నీ భార్య కంప్యూటర్స్‌లో పి.జి. చేసింది! మంచి జాబ్ చేస్తోంది! ఎనభై వేలు నెలకి జీతం తెస్తోంది... అయినా ఆ అమ్మయితో నీకు గొడవేంటి?.." గుచ్చి గుచ్చి అడిగాడు.

'నువ్వు చెప్పినదంతా కరెక్టే! పాయింట్ అది కాదు! నేను దానికి నచ్చలేదట!?"

'వాట్?...' ఆ మాటకి నివ్వెరపోయాడు.

'ఇంకా చాలా చాలా అన్నదిరా నాయుడూ! నా గుండెని నిలువునా చీల్చేసింది..' భద్రం గుండెలోతుల్లోంచి బాధ తన్నుకొచ్చింది. సునామీలా దుఃఖం పెల్లుబికింది.

'డోన్ట్ బి ఎమోషనల్! కంట్రోల్ యువర్ సెల్ఫ్...' బుజ్జగించాడు.

'మనసులో బాధని ఆవేదనని చెప్పుకోవటానికి నీకంటే నాకెవరున్నా(రా!?"

'చెప్పరా చెప్పు! నీ బాధనంతా వెళ్లగక్కు" నీ మనసు తేలిక పడుతుంది..

స్టీవర్ట్ బాటిలు గ్లాసులు స్నాక్స్ తెచ్చి టేబులు మీద వుంచి వెళ్లాడు.

బాటిల్ ఓపెన్ చేస్తూ 'నీతో ఇంకా చాలా చెప్పుకోవా(లా... నా గుండె భారాన్ని దించుకోవాలి...'

మందు రెండు గ్లాసుల్లోకి వొంపాడు భద్రం.

'పెళ్లయిన శోభనం రాత్రి నుంచి ఈ ఆరు నెలలూ మేము శారీరకంగా దగ్గరవలేదు..."

'వాట్ నాన్సెన్స్ యువర్ టాకింగ్?- దీసీజ్ రెడిక్యూలెస్! స్టుపిడిటీ!!' రెచ్చిపోయాడు నాయుడు.

సోడామిక్స్ చేసుకోకుండా 'రా' పుచ్చుకుని "నన్ను దున్నపోతు అంది!... పంది అన్నది! ఎన్ని రకాలుగా నన్ను తిట్టినా... నిందించినా... పట్టించుకునే వాడిని కాదు. లైట్‌గా తీసుకునే వాడిని! అమెకి నా మీద గల కోపానికి అయిష్టతను కారణం వెతకటంలో వుండిపోయేవాడిని.... దట్సాల్..."

"ఇందుకేనా పెళ్లి చేసుకుంది? నీ శ్రీమతి మనస్తత్వమేమిటో నా ఊహకి అందటం లేదురా...' గ్లాసులో వున్న మందు సిప్ చేసాడు నాయుడు.

"అదే ప్రశ్న నేను నా భార్య నడిగాను-నాతో కాపురం చేయనంది. నేను ఆమెకి నచ్చలేదన్నది..ఆమె మాటలు నన్ను చెప్పుతో కొట్టినట్టన్పించినయ్!"

"నచ్చని వాడిని మేరేజ్ ఎందుకు చేసుకున్నదట?... నిన్ను రిజక్ట్ చేసి వుండచ్చుకదా?"

"ఈ ప్రశ్నకి ఆమె వద్ద జవాబువుందో లేదో నాకు తెలీదు. ఎన్నిసార్లు తరచి తరచి అడిగాన నోరు మెదపలేదు..." రెండవ రౌండు పూర్తి చేసాడు భద్రం.

"దారుణం! అమానుషం! ఇంతకు మించిన టార్చర్ వేరొకటుండదురా భాయ్.. దీసీజ్ టూమచ్"

"టూమచ్చే-త్రీమచ్చే! బాధను నా మనసులో దాచుకున్నాను. అమ్మకు ఈ విషయం ఎలా తెలిసిందోఏమో.. దాన్ని ఒక రోజు నిలదీసింది. మాటల్తో వుతికేసింది. ఆ చంపా ఈ చంపా వాయించింది..."

"అప్పుడైనా దారి కొచ్చిదా?"

"మా అమ్మ కొట్టినందుకు.. నాతో నైనాచెప్పకుండా పెట్టె సర్దుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడ ఏం జరిగిందో ఏమో.. బెంగుళూరు బదిలీ చేయించుకుంది. ప్రస్తుతం ఎవ్వరికీ అందనంత దూరంలో... ఆమెరికాలో వుంది. ఉద్యోగ పరంగా అమెరికాకు కంపెనీ పంపించిందని తెల్సింది".

'బావుందిరా.... చాలా బాగుంది...' నాయుడు మాటల్లో వెటకారం ధ్వనించింది.

"నేను నల్లటి వాడినే! నాది భారీకాయమే? అయినా ఊహ తెలిసిన నాటి నుంచి నాకు ఎర్రటి భార్య రావాలని కలలు కనేవాడిని. చదువుకున్న భార్య కావాలని కోరుకున్నాను. ఉద్యోగం చేసే ఆడది నాకు జీవిత భాగస్వామి కావాలని ఎన్నో ఆశలు పెంచుకున్నాను. రంజనిలో నేను కోరుకున్న వన్నీ వున్నందుకు పరవశించిపోయాను! - బంగారు మేనిఛాయ. సన్నగ నాజూకుగా అజంతా శిల్పంలా వున్న రంజనిని పెళ్లి చూపుల రోజున చూడగానే నా వళ్లు పులకరించింది. అంతటి లావణ్యవతి.... అందాల భరిణె నాకు ఎంతగానో నచ్చింది. నా భార్య కాబోతున్నందుకు నా పూర్వ జన్మ సుకృతమనుకున్నాను. ఎన్నో జన్మల పుణ్యఫలమని మురిసాను...కానీ ఏం లాభం? ఆశలు అడియాశ లైనయ్. వూహలు తల్లకిందులైనయ్. రంజని నాకు దూరమైంది. నన్ను అవమానించి ... నాకు అన్యాయం చేసిందిరా నాయుడూ...' దుఃఖం వుప్పెనలాతన్ను కొచ్చింది.

"ష్... నెమ్మది!....." భుజం తట్టాడు.

అప్పటికి రాత్రి పదకొండు దాటింది.

'బార్ మూసే టైమైంది. పోదాం పద!'

'వెడదాం లేరా! అందరం పోయే వాళ్లమే. బిల్లు పే చేసి మనమూ వెళ్లిపోతాం ఇంటికి! ఎవ్వరూ శాశ్వతం కాదు...' వేదాంత ధోరణిలో మాట్లాడి ఫుల్ బాటిల్లో మిగిలిన విస్కీని

సీసాఎత్తి గొంతులో పోసుకుని గరళంలా మింగాడు.

'భద్రం!- నవ్వు ఓవర్‌గా తాగావ్. లేచి నిలబడి నడవలేక పోతున్నావ్. కాల్‌టాక్సీలో వెడదాం! నిన్ను మీఇంట్లో డ్రాప్ చేసి నేను మా ఇంటికెడతాను. నా సైకిలు ఇక్కడే వుంచి రేపొచ్చి తీసుకెడతాను... దా! మెల్లగా నడు..." చేయి పట్టుకు కౌంటర్ దాకా నడిపించాడు నాయుడు.

క్రెడిట్ కార్డుతో బిల్లు పే చేసాడు భద్రం!

అక్కడే వున్న టాక్సీ దాకా భద్రాన్ని పొదివి పట్టుకుని నడిపించాడు నాయుడు.

టాక్సీ రయ్‌న దూసుకుపోయింది!

తెల్లవారి బారెడు పొద్దెక్కినా కొడుకు నిద్ర లేవక పోవటాన తట్టిలేపబోయింది.

భద్రం వళ్లు తల్లి చేతికి మంచుగడ్డలాగ చల్లగా తగిలింది. బోర్ల పడుకున్న కొడుకుని వెల్లకిల తిప్పింది.

భద్రం గుండెలకింద కోడలు రంజని ఫోటో అవుపించింది. కొడుకులో ఏ విధమైన చలనమూ కన్పించనందుకు తల్లి కంగారుపడింది.

డాక్టర్‌కు ఫోన్ చేసి పిలిచింది.

అతిగా తాగినందువల్లనే తీవ్రమైన గుండె పోటుతో చనిపోయాడని డాక్టర్ చెప్పగానే గోవిందమ్మ ఘొల్లుమంది. స్పృహ తప్పి పడిపోయింది!

పూర్‌ఫెలో భద్రం బతుకు తెల్లారిపోయింది?!... పాపం!!

-:(సమాప్తం):-